www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 21 నవంబర్ 2024



వ్యాధి నిరోధక టీకాలపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు బుధవారం ఇన్నీసుపేటలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సర్విలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.భవాని ఈ శిక్షణలో మాట్లాడారు. 0-5 ఏళ్ల లోపు పిల్లలకు వేసే వాక్సిన్‌లు, వేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుతం సంవత్సరంలోపు పిల్లలకు 11 రకాల వ్యాధుల నివారణకు వాక్సినేషన్ చేస్తున్నట్టు తెలిపారు. వాక్సిన్ షెడ్యూల్ ప్రకారం ప్రకారం వాక్సినేషన్ చేయాలని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి మాట్లాడారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీహరి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షమ్మీ కుమార్, డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డాక్టర్ మౌనిక, డాక్టర్ నిషాంత్ పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- ప్రి పెయిడ్ పేరుతో ముందుగా చెల్లింపులు
- ఆందోళనలో విద్యుత్ వినియోగదారులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా విద్యుత్ రంగంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోనున్నారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ విధానం త్వరలోనే పూర్తిస్థాయిలోనే అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో ఇకపై విద్యుత్ వినియోగించాలంటే ముందుగా డబ్బు చెల్లించాలి. సెల్‌ఫోన్‌కు రీఛార్జ్‌లా విద్యుత్‌కు ఇక నుంచి రీఛార్జ్ చేయించుకోవాల్సిందే. డిసెంబరు నుంచే స్మార్ట్‌మీటర్లు దశల వారీగా ఏర్పాటు చేయనున్నారు. నూతన విధానంతో వినియోగదారుల్లోనూ ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇంధన శాఖ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. వివిధ కంపెనీలతో అగ్రిమెంట్ కూడా కుదుర్చుకుంది. ఈ విధానంలో ఇళ్లలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తారు. సెల్‌ఫోన్‌లో సిమ్ కార్డు మాదిరిగా దీనికి కూడా ఒక కార్డు ఇస్తారు. దానికి ముందుగానే డబ్బులు చెల్లించి ఛార్జ్ చేసుకుంటేనే విద్యుత్ వినియోగించుకునే అవకాశం ఉంటుంది. వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లు అన్నింటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధంగా ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదనలు పంపించారు.

సామాన్యులకు అవస్థలే

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే సామాన్యులకు అవస్థలు తప్పవు. కార్డులో రీఛార్జి చేసుకున్న మొత్తం వినియోగిస్తే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అదే సమయంలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 16 లక్షల పైచిలుకు కనెక్షన్లు ఉన్నాయి. వాటిన్నింటికీ రెండు దశలలో స్మార్టు మీటర్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో మీటరు రీడింగ్ తీసే రీడర్లు సుమారు 1200 మంది ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. వచ్చే ఏడాది నుంచి మీటరు రీడర్ల అవసరం ఉండదు. ఇప్పటివరకు నిర్దేశిత సమయంలో బిల్లులు జారీ చేసి అటు ప్రభుత్వానికి ఇటు వినియోగదారులకు వారధిగా పని చేశారు. విద్యుత్ శాఖ లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో బిల్లులు అందజేస్తున్నారు. అటువంటి విశేష సేవలు అందించిన వారికి ఇచ్చే కమీషన్ కూడా విద్యుత్ శాఖ ఆదా పేరుతో రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ శాఖల్లో రూ.కోట్లలో బకాయిలు నిలిచిపోయాయి. ఆ బిల్లుల వస్తువుల కోసం ప్రతి సంవత్సరం ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి. గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులు విద్యుత్ బిల్లులకు బదిలీ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నూతన విధానం, ప్రభుత్వ శాఖల సంగతి ఎలా ఉన్నా విద్యుత్ వినియోగదారులందరికీ శరాఘాతంల మారనుందని స్పష్టమవుతోంది.

మీటర్ భారం వినియోగదారులపైనే..

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా సామాన్యుల నుంచి డిపాజిట్ వసూలు చేయనున్నారు. అధికారుల అంచనాల ప్రకారం మీటరు ఖరీదు సుమారు రూ.7500 ఉంటుంది. ఆ మొత్తాన్ని విద్యుత్ శాఖ తొలుత భరిస్తుందని చెప్పినా చివరకు వినియోగదారులపైనే భారం వేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే వినియోగదారుల రెండు నెలల అడ్వాన్స్‌ను డిపాజిట్ల రూపంలో విద్యుత్ శాఖ వద్ద ఉంచుకున్నారు. తిరిగి కనీసం నెలకు సరిపడా ముందుగా చెల్లించి ఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. అదనంగా మరోసారి డిపాజిట్ చెల్లించే ప్రమాదమూ పొంచి ఉంది. ఈ విధంగా స్మార్టుమీటర్లు విద్యుత్ శాఖకు ఆదాయాన్ని తీసుకురానున్నాయి. వినియోగదారులకు స్మార్ట్ మీటర్లతో అనేక ఉపయోగాలు ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న విధానంతో బిల్లులు ఎక్కువ చెల్లించడం, మీటర్లు జంప్ అవడం తదితర కారణాల వల్ల అధిక మొత్తంలో బిల్లులు వస్తున్నాయి. అదే స్మార్ట్ మీటర్ అయితే అలాంటి పరిస్థితి ఉండదు. విద్యుత్‌ను ఆదా కూడా చేయవచ్చు అంటూ నూతన విధానాన్ని సమర్థిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఒఎల ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ విఒఎలు బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.పూర్ణిమ రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరం బాబు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేబిరాణి మాట్లాడారు. తమ ఉపాధిని దెబ్బతీసే 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, రాష్ట్రంలో 28 వేల మంది విఏలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో పని చేసిన వారిని తొలగించి, వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాలని 2019 నవంబర్‌లో సర్క్యులర్ జారీ చేశారని, నాటి నుండి నేటి వరకు కాలపరిమితి సర్క్యులర్ రద్దు కోసం, ఉద్యోగ భద్రత కోసం హెచ్ఆర్ పాలసీ అమలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర డిమాండ్ల సాధనకు పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం కాలపరిమితి సర్కులర్ రద్దు చేస్తామని, ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు స్వరూపరాణి, జిల్లా కోశాధికారి ఎన్.మహాలక్ష్మి, జి.సీతామహాలక్ష్మి, పి.నాగమణి, వి.వరహాలు, డి.సూర్యవతి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

ఎంఎల్‌సి ఎన్నికల విధులు, బాధ్యతలపై శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఎఆర్ఒ సహాయ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాల నిర్వహణ, పోలింగ్ విధులపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, డిఆర్ఒ టి.సీతారామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది నిర్వహించే విధులపై స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల విధానంలో ఇవిఎం యంత్ర పరికరాలతో కాక, బ్యాలెట్ పేపర్ ఉపయోగించి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఫారం 16 ద్వారా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఫారం నెంబర్‌లలో మార్పు తప్ప ఒకే విధంగా భర్తీ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అనుభవం ఉన్న వారినే పోలింగ్ కేంద్రాల విధుల్లో నియమిస్తున్నట్లు తెలిపారు. సక్రమంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో డిఆర్ఒ సీతారామ్మూర్తి, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, ఎంఎల్‌సి ఎన్నికల అధికారి ఎం.మాధురి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

గోపిమూర్తిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, ఆలమూరు

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గొర్ల మాణిక్యం, జాన్ బాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ మూర్తిరాజుతో పాటు ఇతర అధ్యాపకులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాణిక్యం మాట్లాడుతూ చట్ట సభల్లో ప్రజలపక్షం వహించే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపించుకోవలసిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, సత్యశ్రీదేవి, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపి మూర్తి గెలుపే లక్ష్యంగా పని చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు పిలుపు ఇచ్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులోని యుటిఎఫ్ హోమ్‌లో బుధవారం అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రజా సంఘాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తికి మద్దతు ప్రకటించాలని, అధిక మెజార్టీతో గెలిపించడానికి అందరూ కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. జిల్లా కార్యదర్శులు వైవివి.రమణ, పివివిజిఎస్ఎన్.మూర్తి, రాజు, మండల ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, ఐసిడిఎస్ కో ఆర్డినేటర్ కృష్ణవేణి పాల్గొన్నారు.



ఆలమూరులో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు



ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

చాగల్లు సచివాలయంలో ఆధార్ క్యాంప్ పరిశీలన

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు గ్రామ పంచాయతీ చాగల్లు-2 గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపులను ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి బుధవారం సందర్శించారు. (0-6) వయస్సు గల పిల్లలు అందరికీ ఆధార్ నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో దేవరపల్లి 11 కెవి నూతన ఫీడర్ వర్క్ నిమిత్తము దేవరపల్లి గ్రామంలో ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎపి ఇపిడిసిఎల్ ఇఇ నారాయణ అప్పారావు తెలిపారు. దేవరపల్లి విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన


ప్రజాశక్తి-తాళ్లపూడి, పెరవలి

సైబర్ నేరాలకు గురికాకుండా ప్రతి మహిళా జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. ప్రక్కిలంకలో ఎస్‌బిఐ, వ్యవసాయ శాఖ ఆవరణలో బుధవారం సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు ఆన్‌లైన్ కొనుగోలు కోసం రకరకాల లింక్‌లు ఓపెన్ చేయడంతో నేరగాళ్ల ఉచ్చులో పడడంతోపాటు లింక్‌లు ఓపెన్ చేసిన వెంటనే బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు మాయం అవుతున్నాయని తెలిపారు. వీటి బారిన పడకుండా ప్రతి మహిళా ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ సైబర్ నేరగాల ఉచ్చులో పడితే 1930కి ఫోన్ చేస్తే కొంతవరకైనా తక్షణ సాయం అందుతుందని తెలిపారు.



తాళ్లపూడిలో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

పెరవలి సైబర్ నేరస్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తతో ఉండాలని నిడదవోలు సిఐ పివిజి.తిలక్ అన్నారు. బుధవారం దీపిక కల్యాణమండపంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హ్యాకర్స్ పట్ల వెబ్ హ్యాకింగ్, పోర్నోగ్రఫీ, సైబర్ టాకింగ్, వైరస్ అటాక్స్, వంటి వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్స్, చీటింగ్, థర్డ్ పార్టీ కాల్స్, ఒఎల్ఎక్స్ నేరాలు, ఎపికె ఫ్రాడ్స్, టాస్క్ బేస్డ్ ఫ్రాడ్స్, ఫేక్ ఎస్ఎంఎస్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ చిన్న అనుమానం వచ్చిన సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. చాలామంది సైబర్ నేరగాళ్లు స్కూల్ అడ్మిషన్లు, జాబులు అంటూ కాల్ చేస్తారని ఆన్‌లైన్‌లో అరెస్టులు చేస్తామని భయపెడతారని ఇన్‌కమ్ టాక్స్, కస్టమ్స్, సిఐడి, అంటూ ఫోన్ చేస్తారని అటువంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే హెల్ప్ లైన్ నెంబర్‌కు, లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ దగ్గర ఉంచుకోవాలని, ఎటువంటి అనుమానాస్పద కాల్స్ వచ్చినా లిఫ్ట్ చేయవద్దని ఏ విధమైన సాయం కావాల్సిన తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, బ్యాంక్ ఖాతాదారులు నాయకులు, వ్యాపారస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పెరవలిలో సమావేశంలో మాట్లాడుతున్న సిఐ తిలక్

పాఠశాలల పని గంటలపై ఉత్తర్వులు విరమించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పాఠశాలల పని గంటలను పెంచుతూ విద్యాశాఖ కార్యాలయం ఇచ్చిన మౌఖిక ఉత్తర్వులు వెంటనే విరమించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ నెల 20 నుంచి మండలానికి ఒక ఉన్నత పాఠశాల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేయాలని డిఇఒ కార్యాలయం నుంచి మౌఖిక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పని గంటలు పెంచడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారని వారు పేర్కొన్నారు. శాస్త్రీయంగా, మనోవిజ్ఞానపరంగా ఎనిమిది గంటలు పిల్లలకు నిరాటంక అభ్యసనం ఉండకూడదని వారు తెలిపారు. ఇన్ని పని గంటలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయట్లేదని వారు విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. విద్యాశాఖ కేవలం నెల్లూరు జిల్లాలోనే ఈ నెల 25 నుంచి పైలెట్ ప్రాజెక్టు కింద సాయంత్రం ఐదు గంటల వరకు అమలు చేస్తామని పేర్కొందని, దానిపైన కూడా యుటిఎఫ్ సంఘం అధికారులకు ఒకపక్క విజ్ఞాపనలు చేస్తుంటే అంతకంటే ముందు జిల్లాలో ఇలా అమలు చేయటం సమంజసం కాదని వారు అంటున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు కె.రమేష్, సిహెచ్.దయానిధి, ప్రకాష్, రూపస్ రావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

స్వర్ణాంధ్రలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కంటి చూపు, కంటి సంరక్షణ చాలా ప్రధానమైనదని తగు జాగ్రత్తలు తీసుకుంటే కంటి సమస్యలు లేకుండా జీవితం సాఫీగా గడుస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షులు నాలం నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక లాలాచెరువులో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య సేవా శిబిరాన్ని నరసింహారావు ప్రారంభించారు. స్వర్ణాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు నారా రామ్మూర్తినాయుడు జ్ఞాపకార్థం ఉచిత నేత్ర పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రాంబాబు తెలిపారు. తొలుత రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి స్వర్ణాంధ్ర సభ్యులతో కలిసి నరసింహారావు నివాళులర్పించారు. పరమాంసయోగనంద నేత్రాలయ సౌజన్యంతో ఈ వైద్య శిబిరం నిర్వహించామని రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 90 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 20 మందికి ఆపరేషన్లు అవసరం అవుతాయని సుమారు 100 మందికి ఉచితంగా కంటికి సంబంధించిన మందులను స్వర్ణాంధ్ర తరపున అందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సభ్యులు పడాల రామిరెడ్డి, అనూప్ కుమార్ జైన్, బొప్పన నాగేశ్వరరావు, జనసేన మహిళా నాయకురాలు పోలిశెట్టి అలివేలు, ఒఎస్ చౌదరి, పోలిశెట్టి ప్రియ, హరికృష్ణ, డాక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉచిత కళ్లజోళ్ల పంపిణీ డిసెంబర్ 3న స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రాంగణంలో పంపిణీ చేస్తామని నిర్వాహకులు రాంబాబు తెలిపారు.



వైద్య శిబిరంలో వృద్ధులకు కంటి పరీక్షలు

ఇసుక మాఫియాపై చర్యలు : ఎంఎల్ఎ


ప్రజాశక్తి - కోరుకొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఉచిత ఇసుకను సీతానగరం మండలంలో దళారులుగా ఏర్పడి అక్రమాలకు పాల్పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని వారిపై చర్యలు తీసుకుంటామని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుకలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీలకు, మతాలకు అతీతంగా పారదర్శకంగా ఉచిత ఇసుకను ప్రభుత్వం ఇందజేస్తుందని, దళారులెవరైనా డబ్బులు వసూలు చేస్తే వదిలే ప్రసక్తే లేదన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వరలక్ష్మి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉండ్రాజవరానికి చెందిన వీరమళ్ల వరలక్ష్మి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం జనసేన పార్టీ నుండి ఉండ్రాజవరం ఎంపిటిసిగా ఉన్నారు. ఆమె భర్త ఉండ్రాజవరం జనసేన పార్టీ అధ్యక్షులు వీరమళ్ళ బాలాజీ. వరలక్ష్మి నియామకంపై సూర్యారావుపాలెం సర్పంచ్ మెండే లలిత కుమారి, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కడియం శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డ్రీమ్ స్కూల్ ఛైర్మన్ అంగర రమేష్ బహుమతులు అందజేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత చిలుకూరు శ్రీనివాస్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు. రిటైర్డ్ ఎంఇఒ లజపతిరాయ్, కడియం మెడికల్ నోడల్ అధికారి ఎంవిబి.రామకృష్ణ, బోనం సత్యనారాయణ, తోరాటి వసంతరావు, డాక్టర్ గుర్రాల వెంకట్రావు ర్యాలీ నిర్వహించారు.



నల్లజర్లలో..

చాగల్లు శాఖా గ్రంథాలయంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పి.వీర్రాజు, రిటైర్డ్ ఎంఇఒ కోడి నాగేశ్వరరావు, రిటైర్డ్ టీచర్ వి.గంగాధర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విఎస్‌వి.ప్రసాద్, కె.వీరభద్రరావు, ఎన్.వి రామారావు, కవి రత్నాజీ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు వారోత్సవంలో తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ మాట్లాడారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివి.రామారావు, కోట రామ ప్రసాద్, బొడ్డేటి శ్రీనివాస రావు, హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు, శ్రీనివాసరావు, డాక్టర్ జె.చంద్రప్రసాద్, గుత్తికొండ స్రవంతి, మహతి స్కూల్ ప్రిన్సిపల్ ఐ.పుష్పవతి, గాయత్రి, వివేకానంద, ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లజర్ల మాజీ జెడ్‌పి అధ్యక్షుడు ముళ్ళపూడి బాపిరాజు ఉత్సవాల్లో మాట్లాడారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి.కృష్ణారావు, ఎంఇఒ వై.సత్యనారాయణ, గ్రంథాలయ అధ్యక్షులు జి.సుశీల, అలపాటి రామకృష్ణ కోడూరు నారాయణ, జి.శ్రీరామ్మూర్తి, మల్లిపూడి ఉరమయ్య, యలమాటి ఆనంద్, ఎవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం ఎంఇఒ స్వామి నాయక్, రిటైర్డ్ హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు ఎంవివి.ప్రసాద్, జి.అశోక్, శేఖర్, విజయ్ పాల్గొన్నారు.



కడియంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు



ఉండ్రాజవరంలో..

వంగలపూడి ఇసుక రీచ్ అనుమతులు రద్దు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తూ అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నందున్న వంగలపూడి ఇసుక రీచ్‌లో పాన్ ఇండియా సంస్థకు అనుమతులు రద్దు చేసినట్టు జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు తెలిపారు. రీచ్‌లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఇసుక లబ్ధిదారులు, లారీ యజమానులు, డ్రైవర్లు లారీలను నిలిపివేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. దీతో జెసి చినరాముడు, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి వంగలపూడి ఇసుక ర్యాంపులో బుధవారం పర్యటించారు. ఓపెన్ రీచ్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర వంగలపూడి -1 ర్యాంపులో రూ.67.59 , వంగలపూడి -2 ర్యాంపులో రూ.70.19గా ప్రభుత్వం నిర్ణయించింది. ఓపెన్ రీచ్‌ల వద్ద రూ.270 నుంచి రూ.300 లకు అధిక ధరకు అమ్మడంపై ఫిర్యాదు చేశారు. నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జెసి తెలిపారు. ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వారి అనుమతులు రద్దు చేసినట్టు తెలిపారు. మెసర్స్ పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ వారికి నవంబర్ 11న ఆరు నెలలు కోసం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసినట్టు తెలిపారు.



జెసి చిన్నరాముడుకు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు

నేరాలు ఘోరాలు

1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిడి.అర్జున్ రావు తెలిపారు. మండలంలోని రాయ భూపాలపట్నంలో 800 లీటర్ల బెల్లపు ఊటను, జగ్గంపేట మండలం జె కొత్తూరు గ్రామంలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జైలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు, 17 మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 17మందిలో 9 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించామని, జరిమానా చెల్లించని 8 మందికి కాకినాడ రెండవ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించాని తెలిపారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న మరో 8 మందికి ఒక్కొక్కరికి రూ.300 చొప్పున జరిమానా విధించామని తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన నలుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి. . రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం గ్రామం కాలువ రేవు సెంటర్లో ఉన్న స్వామి పూతరేకులు షాపులో పనిచేస్తోంది. ఈనెల 5న ఆమె పనిచేస్తున్న సమయంలో పక్క షాపులో ఉన్న చింతా మారియ్య వచ్చి పూతరేకుల వ్యాపారం విషయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కులం పేరుతో దూషించాడు. చింతా మారియ్యా కుటుంబ సభ్యులు కూడా ఆమెను కులం పేరుతో దూషించడంతో నిరీక్షణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి

పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-గోపాలపురం

శాంతి భద్రత పరిరక్షణలో అలసత్వం వహించకుండా అంకితభావంతో పని చేయాలని కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ సూచించారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో మండలంలోని జగన్నాథపురంలో తూర్పు గోదావరి జిల్లా- ఏలూరు జిల్లా సరిహద్దులో చెక్ పోస్ట్‌ను డిఎస్‌పి పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్ కుమార్ ఉన్నారు.

10 వరకూ మరుగుదొడ్ల వారోత్సవాలు

ప్రజాశక్తి-కడియం

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిష్టాత్మంగా తీసుకుంది. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం ప్రారంభమైన ఈ వారోత్సవాలు డిసెంబరు 10 వరకూ కొనసాగుతాయి. దీనికి సంబంధించి ఏ రోజు ఏయే కార్యక్రమాలు చేయాలనేది షెడ్యూల్ కూడా విడుదల చేశారు. గ్రామీణ స్థాయిలో నేటికీ మరుగుదొడ్ల వినియోగానికి సంబంధించి పూర్తిస్థాయి అవగాహన లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవడం, అనంతరం చేతులు శుభ్రపరచుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి విషయాలపై ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కడియం మండలం జేగురుపాడులో ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ, మహిళా శక్తి సంఘాల యానిమేటర్లు, పంచాయతీ ఉద్యోగులు అవగాహన కల్పించారు.



జేగురుపాడులో మరుగుదొడ్ల వారోత్సవాలు

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

ప్రజాశక్తి-కడియం

ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు పేర్కొన్నారు. మండలం లోని కడియపులంక నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో నర్సరీ రైతులకు, సిబ్బందికి బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో రాజమండ్రికి చెందిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వారిచే కంటి పరీక్షలు, శ్రీ సాయిరామ్ డెంటల్ హాస్పిటల్ ఇంప్లాంట్ పరీక్షలు, డాక్టర్ మోహన్ డయాబెటిక్ సెంటర్ వారి బిసి, సుగర్ పరీక్షలు, స్మార్ట్ ఎమర్జెన్సీ మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్ జనరల్ సమస్యలను, పల్స్ హాస్పిటల్స్ ఇసిజి సంబంధిత సమస్యలను రైతులు ఉచితంగా పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గాద నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి రావిపాటి రామకృష్ణ, పిఆర్ఓ గరగా నాగేశ్వరావు, డైరెక్టర్లు తాడాల నాగేశ్వరావు, పిల్లా శ్రీనివాస్, అడ్డగర్ల రమేష్, నర్సరీ రైతులు మార్గాని సత్యనారాయణ, టి.భాస్కరరావు, పి.రాంబాబు, బొర్సు వెంకటేశ్వరరావు, ఎం.శివనరాయణ, కె.దుర్గారావు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

టోల్ ప్లాజా నిర్ణయాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

హైవే టోల్ తరహాలో రాష్ట్ర రహదారులపై టోల్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టికే.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలో వేళ్లచింతలగూడెంలో మట్టపర్తి రామ్మోహనరావు ఇంటి వద్ద నిర్వహించిన సమావేశంలో విశ్వేశ్వర రెడ్డి మాట్లాడారు. హైవే టోల్ తరహాలో రాష్ట్ర రహదారులపై టోల్ విధించడం ప్రజలపై వాహనదారులపై భారీగా వసూళ్లకు పాల్పడటమేనని విమర్శించారు. పైగా టోల్ ప్లాజా నిర్ణయాన్ని గోదావరి జిల్లాల్లో ప్రారంభిస్తారని వెల్లడించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్ ప్లాజా నిర్ణయాన్ని ఉపసంహరించకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. 10ఏళ్లుగా వైసిపి, టిడిపి రాష్ట్రాన్ని దోచుకోవడం తప్పా అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. పరిశ్రమలు తెస్తున్నాం అంటూ చంద్రబాబు ఒకపక్క ప్రకటిస్తుంటే మరో ప్రక్క కూటమి ఎంఎల్ఎలు ఆ కంపెనీలపై వాటాల కోసం దాడులు చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, పిసిసి సభ్యులు జ్యేష్ఠ సతీష్ బాబు, మొతా శారదా, వడయార్, పిట్టా రామారావు, పెండ్యాల పరమేశ్వరరావు, యాండపల్లి శ్రీమన్నారాయణ, కాకర్ల హరిబాబు, కౌలూరి రతన్ రాజు, కౌలూరి బాబాజీరావు, చాపల వెంకటేశ్వరరావు, పాపాలు గంగారావు, బుడిగిన ఏడుకొండలు, పోతరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యులు



సిఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎంఎల్ఎ బత్తుల

సమస్యలపై సిఎంకు ఎంఎల్ఎ బత్తుల వినతి

ప్రజాశక్తి - కోరుకొండ

రాజానగరం నియోజకవర్గంలో సమస్యలను పరిష్కారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యమంత్రి ఛాంబర్లో ఆయనను కలసి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా తాగునీరు, సాగునీరు, పురుషోత్తపట్నం భూముల నష్టపరిహారం, కోరుకొండ దేవస్థానం భూములు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, నూతన ఆసుపత్రుల నిర్మాణం, రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యలపై ముఖ్యమంత్రికి బత్తుల విన్నవించుకున్నారు. నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, పెండింగ్ పనులతో పాటు కొత్త పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు యూనిఫారం అందజేత

ప్రజాశక్తి-బిక్కవోలు

పందలపాక పడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ కళాశాలలో ఎన్ఆర్ఐ పడాల ప్రవీణ్ రెడ్డి విద్యార్థులకు బుధవారం యూనిఫారం అందజేశారు. రూ.25 వేల విలువైన స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల ఫౌండర్, తమ తండ్రి పడాల కృష్ణారెడ్డి ఆశయాలకు అనుగుణంగా అత్యున్నత ప్రమాణాలతో విజయవంతంగా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగాఉన్నత పాఠశాల విజయాలు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పాఠశాలకు ఏ అవసరమొచ్చినా తమ కుటుంబం ముందుంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం తమ లక్ష్యమని దానికి అనుగుణంగా విద్యార్థులు చదువులో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రవీణ్ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల లచ్చారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోణాల సత్తిరాజు, అభివృద్ధి కమిటీ కన్వీనర్ సత్తి అచ్యుతరామారెడ్డి, కర్రి వీర్రెడ్డి, పిజిటి నాగబాబు, ఆదినారాయణ, విజయలక్ష్మి, వరలక్ష్మి, పీడీ ద్వారంపూడి యువ రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫారం అందజేస్తున్న ఎన్నారై

కక్ష సాధింపు చర్యలు సరి కాదు : గీత

ప్రజాశక్తి - పిఠాపురం

వైసిపి సోషల్ మీడియా యాక్టివిష్టులు, ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలు సరికాదని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వంగా గీత అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆమె జనసేన కార్యకర్త దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్తను దాడి జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడవకముందే ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలు, దాడులకు పాల్పడుతుందన్నారు. వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టులపై అన్యాయంగా కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. సోషల్ మీడియా అంటే ఏమిటో తెలియని వారిని సైతం వైసిపికి మద్దతుదారులుగా ఉన్నారనే కారణంతో కేసుల్లో ఇరికించడం దారుణమన్నారు. కొద్ది రోజుల క్రితం వైసిపి టీ షర్ట్‌ను వేసుకున్నాడనే నెపంతో దాడి చేసి గాయపర్చిన వారిపై పోలీసులు ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న సిఐ, ఎస్ఐ

ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు

ప్రజాశక్తి - కోరుకొండ

ప్రమాదాల నివారణకు వాహనాలపై ప్రతీ ఒక్కరూ రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్ తెలిపారు. గోకవరం రాజమహేంద్రవరం రోడ్డులోని అయ్యన్నగళ్ల వద్ద బుధవారం వాహనాలను ఆపి రేడియం స్టిక్కర్లు లేని వాహనాలకు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు రేడియం స్టిక్కర్లు లేని వాహనాలకు రేడియం స్టిక్కర్లు వేసి, వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు. రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గుముఖం పడతాయన్నారు. శీతాకాలంలో పొగ మంచు వల్ల అధిక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనాలకు రేడియం స్టిక్కర్లు వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్, కోరుకొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, RAAVI RAMBABU, S/o. R.Kondala Rao, D.No. 12-249/5, Kondaraj Nagar, Rajahmundry, Vemagiri Thota, Vemagiri, E.G.District. A.P., PIN: - 533125. I have changed my name from **RAVI RAMBABU** (Old Name) to **RAAVI RAMBABU** (New Name). Hence forth Iam being called **RAAVI RAMBABU,** S/o. R.Kondala Rao for all purpose.

లింక్ దస్తావేజు పోయినది

కాండ్రేగుల రాధాకృష్ణ, S/o. ధర్మరాజు, డో.నెం. 79-1-3, రామాలయం దగ్గర, జె.ఎన్.రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజినల్ లింక్ దస్తావేజు నెం. 702/1967, Dt. 06-03-1967,** రాజమండ్రి సబ్ రిజిష్టర్ ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజు **ది. 02-11-2024వ తేదీన** నా ఇంటి నుండి రాజమండ్రి ప్రకాష్‌నగర్ సెంటర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా రాజమండ్రి ప్రకాష్‌నగర్ వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

కాండ్రేగుల రాధాకృష్ణ
డో.నెం. 79-1-3, మల్లిఖార్జున నగర్, జె.ఎన్.రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా
సెల్: 94905 99603

డాక్యుమెంట్స్ పోయినవి

కాకినాడ జిల్లా, యు.కొత్తపల్లి మండలం, కొండెవరం గ్రామానికి చెందిన గాది పద్మావతి, భర్త: గాది పాపారావు (లేటు)కు సంబంధించిన డాక్యుమెంట్స్ పోయినవి. కొండెవరం నుండి యు.కొత్తపల్లి యూనియన్ బ్యాంక్‌కు బయలుదేరి వెళ్తుండగా మార్గం మధ్యలో నా యొక్క **డాక్యుమెంట్స్ సర్వే నెం. 338** నెంబరు గల డాక్యుమెంట్స్ పడిపోయినవి. ఇవి ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

నా అడ్రసు:
గాది పద్మావతి
భర్త: గాది పాపారావు (లేటు)
కొండెవరం గ్రామం, యు.కొత్తపల్లి మండలం
కాకినాడ జిల్లా, సెల్: 8074865080

పాస్‌పోర్ట్ పోయినది

గిడ్ల బేబీ కుమారి w/o.శ్యామ్ సుందరరావు D.No. SF-4,బ్లాక్ నెం 22, గవర్నమెంట్ అపార్ట్‌మెంట్స్ R&B కాలనీ, రాజీవ్‌గాంధీ డిగ్రీకాలేజ్ రోడ్ పక్కన, శ్రీరామ్ నగర్ రాజమండ్రి, తూ॥గో॥జిల్లా లో నివసిస్తున్న నాకు విశాఖపట్నం పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారులు ది. **15-11-2018**వ తేదీన **S 5322813** నెంబరు గల పాస్‌పోర్ట్ మంజూరు చేసియున్నారు. సదరు పాస్‌పోర్ట్ జిరాక్స్ కాపీలు తీయించుకొనేందుకు వెళుచుండగా ది. **02-11-2024**వ తేదీన రాజమండ్రి దేవిచౌక్ సెంటర్ నందు పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరు చున్నాను.

గిడ్ల బేబి కుమారి
D.No. SF-4,బ్లాక్ నెం 22, గవర్నమెంట్అపార్ట్‌మెంట్స్, R&B కాలనీ, రాజీవ్‌గాంధీ డిగ్రీకాలేజ్ రోడ్ పక్కన, శ్రీరామ్ నగర్ రాజమండ్రి, తూ॥గో॥జిల్లా
సెల్ నెం. 8500003620

యానాం వార్తలు



హోమ్ మంత్రి నమశ్శివాయంను కలిసిన ఎంఎల్ఎ అశోక్

గవర్నర్, హోంమంత్రితో ఎంఎల్ఎ భేటీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాధన్, హోంమంత్రి నమశ్శివాయం, లోకల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పి.జవహర్‌లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌జిసి సంస్థ ద్వారా మిగిలిన 231 మత్స్యకారులకు రావలసిన వేట నష్టపరిహారానికి సంబంధించి పూర్తిస్థాయిలో జిఓ విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాలో సొమ్మును జమ చేయాలన్నారు. నిజమైన మత్స్యకారులకు లబ్ధి చేకూరడం లేదన్నారు. పేర్ల నమోదు కార్యక్రమంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై సరైన విచారణ చేపట్టాలన్నారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు తమ విధులు సరిగ్గా చేయడం లేదన్నారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కోరినట్లు తెలిపారు. ఎంఎల్ఎ నిధులతో కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లను పిలవడం జరిగిందని, టెండర్లు వేసిన కాంట్రాక్టర్లలో కొంతమంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని, కాంట్రాక్టు లైసెన్స్ రద్దు చేయాలన్నారు. విద్యాశాఖలో పారా టీచర్లను నియమించాలని కోరినట్లు తెలిపారు.

నేటి నుంచి విద్యా - వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

ఈనెల 21 నుంచి 23 వరకూ స్థానిక పిఎం రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన గురువారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని శనివారం సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు తయారుచేసిన సుమారు 200 పైగా సాంకేతిక అంశాలకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయన్నారు.

మళ్లీ పగిలిన మంచినీటి పైపులైన్

ప్రజాశక్తి - యానాం

అంబేద్కర్ నగర్లో బుధవారం తెల్లవారుజామున మూడోసారి మంచినీటి పైపులైన్ పగిలింది. దీంతో గ్రామ యువత సంఘటన స్థలానికి చేరుకుని తక్షణమే గ్యాస్ పైప్‌లైన్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా చేస్తున్నారని, ఇప్పటికే మూడుసార్లు మంచినీటి పైప్ లైన్ పగిలిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ అధ్యక్షులు అర్దాని దినేష్, అరదాడి పోసియ్య పగిలిపోయిన పైపులైన్‌ను పరిశీలించారు.

తాళ్లూరి మఠం ఆస్తిపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - గండేపల్లి

సుమారు 700 సంవత్స రాల చరిత్ర కలిగిన తాళ్లూరు మఠంపై జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించే పనిలో పురావస్తు శాఖ అధికారులు ప్రజాభిప్రాయం సేకరించారు. బుధవా రం తాళ్లూరు వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డిఓ శ్రీరమణి ఆధ్వర్యంలో పురావస్తు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి గుడిని అప్పటి జీయర్‌కట్టిం చడంలో ఎంతో సహకరించారన్నారు. తాళ్లూరు మఠం ప్రసిద్ధి చెందిందని దాని పూర్తి హక్కులు తమ వాళ్ళకే ఉన్నా యంటూ ఆచార్యులు తాళపత్ర గ్రంథా లను చూపించారు. తాళ్లూరును మఠం గా గుర్తిస్తూ అయోధ్య చినజీయర్ స్వామి మఠాల నుంచి తమకు సమాచారం వస్తుందని చెప్పారు. దీనిపై వంశపార పర్య అర్చకులు జేవీ నరసింహ మూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మఠం దేవాదాయ శాఖ నుంచి తొలగించి మఠంగా గుర్తించాలని చెప్పారు. ఇది ఒక వ్యక్తిని మఠాధిపతిగా ప్రకటించకుండా ప్రభుత్వ ఆధీనంలోనే సంరక్షించే బాధ్య తలను చేపట్టాలని సూచించారు. ఆచా ర్యులు చూపిస్తున్న పత్రాలు సరైనవి కాదని, వాటిని ఆచార్యులకి ఇచ్చిన పురా వస్తు శాఖ అధికారులపై చర్యలు చేపట్టా లన్నారు. దీనిపై ఆర్‌డిఓ స్పందిస్తూ మఠానికి చెందిన ఆస్తుల దుర్వినియో గంపై కొన్ని అభియోగాలు వచ్చాయని, వాటిని ప్రజల సమక్షంలో అభిప్రాయా లు సేకరించి నివేదికను తమ ఉన్నతా ధికారులకు నివేదిస్తామని చెప్పా రు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిసి డిఎల్‌వి.రమేష్‌బాబు, పురావస్తు శాఖ డిడి ఒ.రామసుబ్బారెడ్డి, తాళ్లూరు సర్పం చ్ శీలమంతుల వీరబాబు, పురావస్తు శాఖ ఎడి పి.సురేష్ పాల్గొన్నారు.



అప్పలనాయుడును అభినందిస్తున్న జనసేన నాయకులు

అప్పలనాయుడుకు పలువురి అభినందన

ప్రజాశక్తి -దేవరపల్లి

ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ ఏలూరు ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడుకు పలువురు అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు, పార్టీ నాయకులతో కలిసి బుధవారం విజయవాడలో అప్పలనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. విజయవాడ జోన్ పరిధిలోని మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యం కల్పించి ప్రధానంగా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సువర్ణ రాజు కోరారు. అనిశెట్టి మధు, పోలుమాటి నాని, చిలుకూరి ఫణి, తరగళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కల్యాణ మండపంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మున్సిపల్ కళ్యాణమండపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఫైర్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ... ఫైర్ క్రాకర్స్ నిప్పు రవ్వలు ఎగిరిపడి అగ్ని ప్రమాదం సంభవించినట్టు తెలుస్తుందన్నారు. సుమారు రూ. 4 లక్షల ఆస్తి నష్టం సంబంధించి ఉంటుందని అంచన వేశారు.

పారిశుధ్య సిబ్బందిని పెంచండి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ విస్తరణ, చెత్త వినియోగం దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య కార్మికులను పెంచాలని మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వర్రె గిరిబాబు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో సంఘ కార్యదర్శి శివకోటి అప్పారావు మాట్లాడుతూ పట్టణ జనాభా, వినియోగం దృష్టిలో పెట్టుకుంటే పారిశుధ్య నిర్వహణకు 250 మంది కార్మికులు ఉండాలన్నారు. కానీ పెద్దాపురం మున్సిపాలిటీలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు కలిపి 80 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు వారాంతరపు సెలవులు ఇవ్వకుండా పూట సెలవులు ఇస్తున్నారన్నారు. వీరికి వారాంతరపు సెలవులు ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం క్యాజువల్ లీవులు ఇవ్వటం లేదన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు మున్సిపాలిటీ సమకూర్చాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు దొండపాటి శేఖర్, వర్రె రమేష్, భవాని, సత్యనారాయణ, మడికి కృష్ణ, రమేష్, దొండపాటి సురేష్, సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సిఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. బుధవారం మండలంలోని వికె.రాయపురం జడ్‌పి హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ అరెస్టులు, ఈజీ మనీ సంపాదించడం పట్ల యువత ప్రక్కదారి పడుతున్న తీరును ఆయన వివరిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Court Notice

In the court of the VII Additional District judge at Vijayawada
O.S No:20/2024
Between:-
మీసాల రంగారావు రిప్రజెంటెడ్ బై జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హెూల్డరు, మీసాల సునీల్ తండ్రి రంగారావు,
..... వాది
మరియు
హాసిని ఇన్‌ఫ్రా కన్స్‌స్ట్రక్షన్స్ అండ్ డవలపర్స్ రిప్రజెండెంట్ బై మేనేజింగ్ పార్టనర్స్ వగైరాలు ...
..... ప్రతివాదులు
టు,
1వ ప్రతివాది :-
హాసిని ఇన్‌ఫ్రా కన్స్‌స్ట్రక్షన్స్ అండ్ డవెలపర్స్ రిప్రజెండెంట్ బై మేనేజింగ్ పార్టనర్స్
1) కర్రి సునీల్ కుమార్ రెడ్డి, తండ్రి సత్యన్నారాయణ,
2) సాయినీడి శ్రీకాంత్, తండ్రి వెంకటేశ్వరరావు,
ఇంద్రప్రస్థ, యుధిష్టర అపార్టుమెంట్, ప్లాట్ నెం:103, విధ్యాకాలనీ, కాకినాడ.

పై నెంబరు దావా లో వాది, ప్రతివాద్లు పై **Specific performance** దావాను దాఖలు చేయగా 1వ ప్రతివాది అయిన మీకు నోటీసులు జారీ చేయు నిమిత్తం శ్రీ కోర్టు వారు ప్రత్యుమ్నాయ సర్వీసు గా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ చేసియున్నారు. కావున 1వ ప్రతివాది ది 02-12-2024న ఉదయం గం॥10-30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని, హజరై అభ్యంతరములు తెలియజేయ గలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
వాయిదా తేది: 02/12/2024
ఇట్లు
పిళ్ళా రవి , అడ్వకేట్,
సామారంగ చౌక్ , విజయవాడ-1
సెల్ ఫోన్ : 9848110109

ప్రకటన

నా క్లయింటు అయిన కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, డైరీఫామ్ సెంటర్, రెవెన్యూ కాలనీ, 1వ వీధి, డోర్ నెం. 17-11-5/బి రు కాపురస్తులు **షేక్ నిస్సార్ అహ్మద్** గారి కుమారుడు **అజీజ్ అహ్మద్** గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ బర్మా కాలనీ, డోర్ నెం. 3-16ఎ-18రు కాపురస్తులు నిస్సార్ అహ్మద్ గారి కుమారుడు నియాజ్ అహ్మద్ గారు ది. 6-1-2009 తేదీన బోడి మురళీకృష్ణ గారి వద్ద నుండి కొనుగోలు చేసిన **క్రయ దస్తావేజు నెం. 82/2009** (SRO, సర్పవరం) ఆస్తి అయి ఉన్నది. ఈ ఆస్తికి సంబంధించిన 1) దస్తావేజు నెం. 6409/1992, 2) దస్తావేజు నెం. 4924/2003, 3) దస్తావేజు నెం. 82/2009 గల ఒరిజినల్ దస్తావేజులు పోయినవి అని, కాకినాడ సిటీ 2వ పట్టణ పోలీస్ వార్కి కంప్లయింట్ చేయగా వారు ది. 18-11-2024 తేదీన వారు నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్ MLDO12477058 ఇచ్చియున్నారు చెప్పుచున్నారు. సదరు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని అమ్మచూపగా నా క్లయింటు కొనుగోలు చేయుటకు ఒక ఒప్పందము కుదుర్చుకొనియున్నారు. కావున ఈ ఆస్తికి సంబంధించి ఎవరికైన ఎటువంటి హక్కులు గాని, క్లయిములు గాని ఉన్న ఎడల ఈ ప్రకటన ప్రచురించిన వారం రోజులలో ఈ క్రింది అడ్రస్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయవలెను. లేని ఎడల ఈ ఆస్తిని నిర్వివాద నిప్పేచీ ఆస్తిగా భావించి నా క్లయింటు కొనుగోలు చేయుదురు. తరువాత వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు

పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, పూర్వం కాకినాడ రిజిస్ట్రారులో చేరిన, ప్రస్తుతం సర్పవరం సబ్-రిజిస్ట్రారులో చేరిన, మాధవపట్నం గ్రామపంచాయతీకి చెందిన మాధవపట్నం గ్రామం తాలూకు జిరాయితీ పల్లం రివిజన్ సర్వే నెం. 44/3రులో య. 1.38 ట్లు, రివిజన్ సర్వే నెం. 45/1రు య. 0.82ట్లు, రివిజన్ సర్వే నెం. 55/3రు య. 0.04 1/6ట్లు, రి.సర్వే నెం. 55/2రు య. 0.62 ట్లున్నూ వెరశి య. 2.86 1/6ట్లు భూమిని ఇతరులు భూమితో కలిపి డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్, హైదరాబాదు వారిచే ఎల్.పి. నెం. 7/92రుగా మహంతినగర్ అను పేరుతో అప్రూవల్ కాబడిన లే-అవుటు ప్లాను దాఖలా ప్లాట్లులో ప్లాటు నెం. 464రు తాలూకు చ॥గ॥. 262.77లు లేక 219.70 చ॥మీ॥లు ఖాళీ స్థలముకు హద్దులు, కొలతలు వివరం.

తూర్పు: అ. 60.9 అం.లు లేక 18.51 మీ. ప్లాటు నెం. 463రు స్థలం. **పడమర:** అ. 57.6 అం.లు లేక 17.52 మీ. ప్లాటు నెం. 465 రు స్థలం. **ఉత్తరం:** అ. 40.0 అం.లు లేక 12.19 మీ. అ. 33లు వెడల్పు గల రోడ్డు. **దక్షిణం:** అ. 40.0 అం.లు లేక 12.19 మీ. ప్లాటు నెం. 469 రు స్థలం. యావత్తు ఈజిమెంటు హక్కులతో సర్వం సహా.

యార్లగడ్డ శ్రీనివాసరావు
అడ్వకేట్, డోర్ నెం. 1-31
ఎస్.అచ్యుతాపురం, కాకినాడ
సెల్: 9848833972